క్లుప్తంగా

బిక్కవోలు తహసీల్దార్‌గా రమణి బాధ్యతల స్వీకరణ



బిక్కవోలు నూతన తహసీల్దార్‌కు అభినందలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

బిక్కవోలు: బిక్కవోలు తహసీల్దార్‌గా ఎల్ రమణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలు అనంతరం చేసిన బదిలీలో భాగంగా కృష్ణా జిల్లా నుంచి ఆమె బిక్కవోలు వచ్చారు. ఇప్పటి వరకు బిక్కవోలులో పనిచేస్తున్న కన్యాకుమారి కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెకు రెవెన్యూ సిబ్బంది అభినందలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ నందకిషోర్, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన సుస్వాగతం

మధురపూడి: కోరుకొండ తహసీల్దార్‌గా వి.సుస్వాగతం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమహేంద్రవరం అర్బన్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నరేష్‌కుమార్, ఆర్ఐ ఎస్.హరిబాబు, వీఆర్వోలు ఆయనకు అభినందనలు తెలిపారు.

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

పెదపూడి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్‌కు సంబంధించి సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎంఎస్ ప్రసాద్ తెలిపారు. 15 వ ఆర్థిక సంఘ నిధులు వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణ, పంచాయతీరాజ్ చట్టంపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం



వడిశలేరులో అగ్నిప్రమాద బాధితుడుకి బియ్యం అందిస్తున్న అధికారులు, నేతలు

రంగంపేట: వడిశలేరు గ్రామంలోని తాటాకిల్లు శుక్రవారం దగ్ధమైనట్టు వీఆర్వో వి.భద్రయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొల్లం చిన వెంకటేశులు నివాసం ఉంటున్న ఇంటిలో వంట చేసే సమయంలో గ్యాస్ మంట చూరుకు అంటుకోవడంతో ఒక్కసారి మంటలు వ్యాపించగా చుట్టు పక్కల ప్రజలు స్పందించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 వేలు ఆస్తి నష్టం ఏర్పడిందని బాధితులు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఆదేశాల ప్రకారం బాధిత కుటుంబానికి 25 కిలోలు బియ్యాన్ని అధికారులు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అందించారు.

ఆర్ట్స్ కళాశాలలో ఎమోషనల్ లెర్నింగ్‌పై శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోషల్ ఎమోషనల్ లెర్నింగ్‌పై డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఆంధ్ర రాష్ట్ర కళాశాల ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో యునెస్కో సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిని కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులకు సానుభూతి, జాలి, దయ, మనస్సును, శరీరాన్ని సమన్వయం చేసుకోగలడం, భావ ప్రజ్ఞ ఉండడం లేదని, వీటిపై శిక్షణ అత్యంత అవసరమన్నారు. దీనికి అధ్యాపక శిక్షణ కార్యక్రమం ఎంతగానో సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త సంజీవ్ కుమార్, వివిధ నోడల్ రిసోర్స్ సెంటర్ నుంచి దాదాపు 44 మంది అధ్యాపకులు, 16 మందికీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

హిరోషిమా, నాగసాకి దినోత్సవంపై అవగాహన

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో హిరోషిమా, నాగసాకి దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అణుశక్తి ప్రాధాన్యత, దుష్పరిమాణాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమలలక్ష్మి, కళాశాల అకాడమిక్ సెల్ సమన్వయ కర్త డాక్టర్ సంజీవ్ కుమార్, ఇతర భౌతికశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణ చెరలో ప్రభుత్వ బంగ్లా

- అన్యాక్రాంతమవుతున్న కోట్లు విలువ చేసే భూములు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



నిరుపయోగంగా ఉన్న జెడ్పీ ట్రావెలర్స్ బంగ్లా

రాజానగరం: గ్రామంలో పాత జాతీయ రహదారిని ఆనుకుని, సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ట్రావెలర్స్ బంగ్లా నిరుపయోగంగా ఉంది. బంగ్లాకు చుట్టూ ఉన్న ప్రాంతాలు ఆక్రమణలకు గురై, బంగ్లా ఉనికికే ప్రశ్నార్థకంగా తయారైంది. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో గత రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా పడి ఉన్న జిల్లా ప్రజాపరిషత్‌కి చెందిన ట్రావెలర్స్ బంగ్లా పరిస్థితి ఇది.

నిరుపయోగంగా..

పూర్వం పంచాయతీ సమితిల కాలంలో కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం ప్రాంతాలకు రాజానగరం సమితి కేంద్రంగా ఉండేది. ఆ సమయంలో పాలకులు, ప్రముఖులకు సౌకర్యంగా ఉండేవిధంగా పోలీసు స్టేషనును ఆనుకుని, అప్పటి జాతీయ రహదారికి చేర్చి, జిల్లా ప్రజా పరిషత్‌కు చెందిన ఐదెకరాల విస్తీర్ణంలో సుమారు 50 ఏళ్ల క్రితం రెండు గదులతో ఒక బంగ్లాను నిర్మించారు. తరువాత పంచాయతీ సమితిల స్థానే మండల ప్రజాపరిషత్ వ్యవస్థ వచ్చినాగానీ, అప్పుడు కూడా రాజానగరం మండల కేంద్రం కావడంతో ఈ బంగ్లా ఉపయోగంలోనే ఉండేది. టీడీపీ నుంచి రెండు పర్యాయాలు కడియం ఎమ్మెల్యేగా విజయం సాధించిన వడ్డి వీరభద్రరావు ఈ బంగ్లాకు తరచూ మరమ్మతులు చేయిస్తూ, రాజకీయ కార్యకలాపాలకు ఉపయోగిస్తూ వచ్చారు. ఆయన తరువాత వచ్చిన నాయకులు ఈ బంగ్లాను సెంటిమెంటుగా టచ్ చేయకుండా దూరంగా ఉండడంతో కోట్లు విలువ చేసే బంగ్లా, పరిసర స్థలాలు నిరుపయోగంగా మారాయి.

సామాన్యులకు ఫంక్షన్ హాలుగా ఉండేది

స్థానికంగా కల్యాణ మండపాలు పెద్దగా లేకపోవడంతో సామాన్యులు శుభకార్యక్రమాలకు దీనిని ఒక ఫంక్షన్ హాలుగా ఉపయోగించేవారు. అందుకు అవసరమైన అనుమతులు రాజమహేంద్రవరంలోని జెడ్పీ శాఖ అధికారులు నుంచి నిర్ణీత రుసుం చెల్లించి పొందాల్సి వచ్చేది. అలాగే స్థానికంగా ఉన్న గృహ నిర్మాణ శాఖ కూడా పేదల ఇంటి నిర్మాణాలకు సరఫరా చేసే సిమెంటు, ఇతర సామగ్రిని స్టోర్ చేసేందుకు ప్రాంగణాన్ని గొడౌన్‌గా వాడుకునేది. కాలక్రమంలో బంగ్లా పరిసరాలు ఆక్రమణలకు గురికావడం, బంగ్లాలోని రెండు షూట్‌లు శిథిలావస్థకు చేరువడంతో స్థానికులు శుభకార్యక్రమాలకు వాడుకోవడం కూడా మానేశారు. దీంతో ఈ బంగ్లా వైపు చేసే వారే కరువయ్యారు.

ఆక్రమణలకు అడ్డే లేదు

రాజమహేంద్రవరానికి అత్యంత చేరువలో ఉండడంతో రాజానగరంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీనితో సామాన్యులు సెంటు భూమి కూడా కొనలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కొంతమంది పేదలు దృష్టి ఈ బంగ్లా పరిసరాలపై పడింది. బంగ్లాకు ఉత్తరం వైపున పోలీసు స్టేషను, తూర్పు వైపున అగ్రహారంలోని నివాసాలు ఉంటే, పడమరవైపు పాత జాతీయ రహదారి, దక్షిణం వైపు అగ్రహారంలోకి వెళ్లే రోడ్డు ఉన్నాయి. ఈ రోడ్లకు, బంగ్లాకు మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని దక్షిణం వైపు కొంత మంది పేదలు నివాసాలకు ఆక్రమించుకుంటే, మరికొందరు తమ వ్యాపార లావాదేవీలకు జాతీయ రహదారి వైపు బడ్డీలు పెట్టి ఆక్రమించారు.



బంగ్లా ముంగిట ఆక్రమణలు

ఎవరూ పట్టించుకోక..

చుట్టూ ప్రహరీతో శిథిలావస్థకు చేరువైన జెడ్పీ బంగ్లాను అధికారులకు పట్టకపోయినప్పటికీ సంఘవ్యతిరేక శక్తులకు మాత్రం ఆనవాలంగా మారిపోయింది. రాత్రి సమయంలో ఇది అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా తయారైంది. పాత జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతం విలువ కోట్లలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఈ బంగ్లాపై దృష్టి పెట్టి ఆక్రమణలను తొలగించి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడంతోపాటు బంగ్లాను మినీ కల్యాణ మండపంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఎంతో ఆదాయం వస్తుందని, ప్రభుత్వ భూములకు రక్షణ ఉంటుందని స్థానికులు అంటున్నారు.

కల్యాణ మంటపంగా అభివృద్ధి చేస్తే..



గ్రామంలో ఉన్న జెడ్పీ ట్రావెలర్స్ బంగ్లా ఏరియా రూ.కోట్లు విలువ చేస్తుంది. అయినా ఎవరికీ అక్కర్లేనట్టుగా వదిలేశారు. కనీసం మినీ కల్యాణ మండపంగా అభివృద్ధి చేస్తే, సామాన్యులకు ఎంతో ఉపయోగపడుతుంది. పాత జాతీయ రహదారి వైపు ఉన్న స్థలంలో షాపులను నిర్మించి ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఎంతోమందికి జీవనోపాధి కూడా లభిస్తుంది.

– మోది సత్తిబాబు, బీజేపీ నాయకుడు, రాజానగరం

ఎన్నికల హామీలు అమలు చేయాలి

మధురపూడి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ ఎంఎల్–న్యూడెమోక్రసీ జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి యేసుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కోరుకొండలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమంటే ప్రజలను వంచించడమేనని అన్నారు. ముంపు ప్రాంతాల్లో రైతులకు సహాయక చర్యలు చేపట్టాలని, పంట నీటమునిగి నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం అమలు చేయకపోతే పేద పిల్లలు బడికి దూరమవుతారన్నారు. కేంద్రప్రభుత్వం ఇస్తున్న పసలీ భామా తప్ప మరే విధమైన సహాయక కార్యక్రమాలను చేయకపోవడం దుర్మార్గం అన్నారు.

విజయదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు



సంపరలోని విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: శ్రావణమాసం సందర్భంగా పెదపూడి మండలం సంపర విజయదుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకులు హనుమంతరావు పంచామృత అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో లలిత సహస్రార్చన చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు.

ఘనంగా బాపనమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



రామవరంలో బాపనమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణ

పెదపూడి: అనపర్తి మండలంలోని రామవరంలోని స్థానిక నడివీధిలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత బాపనమ్మ తల్లి, క్షేత్ర పాలకుడు పోతురాజు స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి శుక్రవారం వేద పండితులు మంత్రోచ్చరణ మధ్య ఘనంగా నిర్వహించారు. వివాహ సమయంలో పెళ్లి కొడుకు కుటుంబ సభ్యులు మేళ తాళాలతో గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి ఈ బాపనమ్మ తల్లి వద్ద చలివిడి పానకాలు పొయడం ఆచారంగా కొనసాగుతోంది. రామవరం గ్రామ సంప్రదాయం, ఆచారాలతో ముడిపడి ఉన్న బాపనమ్మ తల్లి పాత ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృషారెడ్డి ఉపసర్పంచి, వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బెళ్ల కృష్ణారెడ్డి తన కుమారు సబ్బెళ్ల సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థం సుమారు రూ.9 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పద్మావతి దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అనంతరం బాపనమ్మ తల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, అనపర్తి జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు గొలుగూరి గౌతమి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, పొలమూరు ఉపసర్పంచి సత్తి సూరారెడ్డి, సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మోమోరియాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ధాత్రి సభ్యులు సబ్బెళ్ల తిరపారెడ్డి, మేడపాటి శివ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకుందాం

- 'నన్నయ'లో అంతర్జాతీయ ఆది వాసీ గిరిజన దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 'ఇండిగేనోస్ యూత్ యాజ్ ఏజెంట్స్ ఆఫ్ చేంజ్ ఫర్ సెల్ఫ్ డిటర్మినేషన్' అనే అంశంపై శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ సెల్ ద్వారా విద్యావేత్తలు, ఓఎన్‌జీసీ వంటి సంస్థల సహకారంతో యూనివర్సిటీ పరిధిలో చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ పట్టాసి జగన్నాథరావు మాట్లాడుతూ విద్యాభ్యాసంపై ఏకాగ్రతకు ఏకలవ్యుడిని, ఉన్నత చదువులతో ఉన్నత పదవులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వంటి వారిని ఆదర్శంగా తీసుకుని, లక్ష్యసాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ పి.విజయనిర్మల, మాధవి మౌళి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ శీలం రాజ్యలక్ష్మి, డాక్టర్ ఎం. సుజాత, డాక్టర్ ఆర్. వరహాలదొర, డాక్టర్ బాలసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనధికార డ్యాంతో మునుగుతున్న ఆవ పొలాలు



అనధికారిక డ్యాం కారణంగా ముంపునకు గురవుతున్న ఆవ పొలాలు

రాజమహేంద్రవరం రూరల్: అనధికారికంగా నిర్మించిన డ్యాం కారణంగా ఆవ భూములు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూరల్ మండలం రాజవోలుకు చెందిన రైతులకు కడియం ఆవ ప్రాంతంలోని సర్వే నంబర్ 535 నుంచి 700 వరకూ సుమారు 500 ఎకరాల పంటభూములు ఉన్నాయి. బొమ్మూరు, నామవరం, హుకుంపేట, పాత బొమ్మూరు ప్రాంతాల నుంచి మురుగునీరు రాజవోలు మీదుగా ప్రవహించి కడియం ఆవ మీదుగా ఉన్న మురుగు కాలువలోకి ప్రవహిస్తుంటుంది. రాజవోలు, కడియం గ్రామాలకు మధ్యలో మురుగు కాలువకు డ్యాం ఉంది. ఈ డ్యాం ఇరిగేషన్ రెవెన్యూ శాఖలకు ఎటువంటి సంబంధం లేదని రైతులు పేర్కొన్నారు. కేవలం ఒక వ్యక్తి పొలానికి నీరు తీసుకువెళ్లే నిమిత్తం అక్రమంగా నిర్మించారన్నారు. చిన్న చెక్ డ్యాం కాంక్రీట్ దిమ్మ మాదిరిగా ఉండే కట్టడాన్ని ఒక వ్యక్తి స్వలాభం కోసం డ్యాంగా నిర్మించడంతోపాటు, డ్యాం గేటును ఎప్పుడూ మూసే ఉంచడంతో మురుగునీరు కిందకు ప్రవహించకుండా పక్కనున్న పొలాలు ముంపునకు గురవుతున్నాయని వారు వివరించారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉండడంతో పంట పూర్తిగా పాడైపోయి తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. ఇప్పటికైనా ఆ ప్రాంతాలను పరిశీలించి, తమను ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ డ్యాం రికార్డుల్లో లేదని అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా శ్రావణమాసం పూజలు

బిక్కవోలు: శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడారు. ఉదయం ఇంటి వద్ద పూజల అనంతరం ఆలయాల్లోని అమ్మవారిని దర్శించుకున్నారు. కొమరిపాలెం కనకదుర్గమ్మ తల్లి ఆలయం వద్ద, ఊలపల్లి జి.మామిడాడ రోడ్డు ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పందలపాక కట్లమ్మ తల్లి ఆలయం వద్ద, తొస్సిపూడి నవదుర్గ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

బిక్కవోలు: స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద స్వామివారి ప్రత్యేక అలంకరణ చేశారు. శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా అర్చకులు బిక్కవోలు రాఘవరామ్, వంశీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలోని ఆలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కేఆర్ విద్యార్థినులు

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ్‌కుమారి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని పుస్తక పఠనం చేయాలని, పుస్తకం లేని గది ఆత్మ లేని శరీరం వంటిదన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంగ్లశాఖ అధ్యాపకులు డాక్టర్ బి.అనురాధ, పీఎస్ఎస్ఎస్ఎన్. దుర్గాప్రసాద్, జేఆర్.ఠాగూర్, బి.జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

బిందు సేద్యం యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: భూగర్భ జలాలు అడుగంటిన తరుణంలో బిందు సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ నాణ్యమైన పంట దిగుబడిని పొందవచ్చునని ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) డైరెక్టర్ అడపా దుర్గేష్ శుక్రవారం తెలిపారు. పరికరాలు కావాల్సిన రైతులు సమీప రైతు సేవ కేంద్రంలో ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రాల జెరాక్స్‌లు, తమ పేర్లను విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్/ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ / విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ ద్వారా ఏపీఎంఐపీ యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 12.5 ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. తుంపర సేద్యానికి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 55 శాతం, 5 ఎకరాల పైన ఉన్న వారికి 45 శాతం రాయితీతో తుంపర సేద్యం పరికరాలు అందిస్తారన్నారు. జిల్లాకు 2024–25 సంవత్సరానికి 9 వేల హెక్టార్లు భౌతిక లక్ష్యాన్ని నిర్దేశించారని దుర్గేష్ తెలిపారు.

స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని పొందాలి



రంగంపేటలో మండల పరిషత్ కార్యాలయం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో



రంగంపేటలో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రంగంపేట: భారత స్వాతంత్య్రోద్యమ ఘట్టాలు, మహనీయుల త్యాగాల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తిని పొందాలని ఎంపీడీవో వెంకటరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలోని భాగంగా తాహసీల్దార్ కార్యాలయం నుంచి మండలం పరిషత్ వరకు అంగన్‌వాడీ కార్యకర్త, మహిళ సంఘాలు, వీవోఏలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం తిరంగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలోని అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయండి

రంగంపేట: భారత ప్రభుత్వం చేపట్టిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి విజయవంతం చేయాలని ఎంపీడీవో వి.వెంకటరత్నం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులుతో ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలను, మహిళ సంఘాలు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకోవాలన్నారు. పాఠశాల, కళాశాల, స్థానిక ప్రజలతో తిరంగా యాత్ర చేపట్టాలన్నారు. దేశభక్తితో కూడిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో తిరంగా కచేరీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవోలు కె. శ్రీనివాసరావు, మధుసూధనరావు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహాలకు రక్షణ ఏదీ ?



కోరుకొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న రాంబాబు

మధురపూడి: విజయవాడ నడిబొడ్డులోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించడంలో విఫలమైందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, గుమ్ములూరు సర్పంచ్ నక్కా రాంబాబు విమర్శించారు. శుక్రవారం కోరుకొండ బస్‌స్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం రాత్రి విజయవాడ శృతివనంలో గత ప్రభుత్వం లక్షలాది రూపాయల ఖర్చు చేసి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ పెద్ద విగ్రహానికి రక్షణలేదని, ఆ విగ్రహాన్ని రక్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దళితుల జోలికొస్తే తిరుగుబాటు జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ దళితులంటే తక్కువగా చూడకూడదన్నారు. విజయవాడ సంఘటన విషయంలో భేషరతుగా దళితులకు క్షమాపణ చెప్పాలని, అందుకు కారకులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘటనలో పాల్గొన్న పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎంపీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ పిట్టా కృష్ణ,, దాసరి యేసు, గొంతి కేశవ, మట్టా సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి

- రైట్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో జెడీ లక్ష్మీనారాయణ



మానసిక, వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో విద్యార్థులను చైతన్యపరుస్తున్న జేడీ లక్ష్మీనారాయణ

రాజానగరం: చాలా మంది విద్యార్థులు పరీక్షల సమయంలో పగలు, రాత్రి ఎంతో కష్టపడి చదివామని చెపుతుంటారు, కానీ కష్టపడి చదవడం కాదు ఇష్టపడి చదివితేనే అది బుర్రలోకి చేరి జ్ఞాపకం ఉంటుందని సీబీఐ రిటైర్డ్ డైరెక్టర్, పొలిటీషియన్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. భూపాలపట్నంలోని రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన మానసిక, వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐన్‌స్టీన్, సత్యం నాదెళ్ల, అబ్దుల్ కలాం గురించి చెపుతూ మనం ఎక్కడ చదివాం అనే ముఖ్యం కాదని, ఏం సాధించామనేదే ముఖ్యమన్నారు. తెలుసుకోవాలనే తపన ఉంటే ప్రతి ఒక్కరూ మేధస్సును ఉపయోగించి అద్భుతాలను సాధిస్తారన్నారు. శరీరక, మానసిక వ్యాయామాలు, మాట్లాడే విధానం, క్రమశిక్షణను అలవర్చుకుంటే జీవనశైలిలో ఎటువంటి ఒత్తిడినైనా జయించగలుగుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎ.శ్రీహరి, వైస్‌చైర్మన్ టి.నరసింహరావు, ప్రిన్సిపాల్ బి.సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీలో సెల్ ఫొటోగ్రఫీ కోర్స్



కోర్సు వివరాలను తెలియజేస్తున్న రాజబాబు తదితరులు

సీటీఆర్ఐ: ప్రస్తుత కాలంలో సెల్ ఫోన్ మనిషిలో అంతర్భాగమైన వస్తువుగా మారిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోనే తొలిసారిగా సెల్ ఫొటోగ్రఫీపై సర్టిఫికెట్ కోర్స్ ప్రవేశపెడుతున్నట్టుగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు ఆధ్వర్యంలో జగతి మీడియా క్రియేషన్స్ సీఈవో శింగన నారాయణమూర్తి, డైరెక్టర్ కోమటి నాగేశ్వరరావుతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ 50 రోజుల పాటు ఈ కోర్స్ ఉచితంగా నేర్పిస్తామని తెలిపారు. ఏ కళాశాల విద్యార్థులైన ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్స్‌పై ఆసక్తి ఉన్న వారు క్లాసులకు హాజరుకావచ్చన్నారు. జగతి మీడియా క్రియేషన్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ కోర్సులో మొబైల్ కెమెరా, బేసిక్ ఫొటోగ్రఫీ, కెమెరా సెట్టింగ్స్, కంపోజిషన్ టెక్నిక్స్, ఫ్రేమ్ లైటింగ్, గ్రూప్ ఫొటోగ్రఫీ, మొబైల్ ఎడిటింగ్ యాప్స్, క్రెడిట్ షూటింగ్, అవుట్డోర్ – ఇండోర్ లాంటివి, దీంట్లో ప్రధానంగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సణుగుల రాజ్‌కుమార్, పల్లి సుధా, జె.సుగుణ తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు 9849579579, 9494441526 నంబర్లను సంప్రదించాలని సూచించారు.